

ప్రాజెక్టు పనులు ఆపాలి

ఉమామహేశ్వర ప్రాజెక్టు పనులు అడ్డుకుంటామని నిర్వాసిత రైతులు అన్నారు.

వివరాలు 8లో ▸



పోటెత్తిన భక్తులు

ఆదిశిలాక్షేత్రంలో స్వామివారి దర్శనానికి భక్తులు పోటెత్తారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
34.7 /18.9

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. చలి తీవ్రత కాస్త తగ్గనుంది. రాత్రి మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

24 గంటలు నీటి సరఫరా నిలిపివేత

నారాయణపేట: మరికల్ నుంచి నారాయణపేట వెళ్లే దారిలో కొత్తతండా వద్ద మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ అయ్యిందని, దీని మరమ్మతు నిమిత్తం ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి సోమవారం సాయంత్రం 6 వరకు నీటి సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని మిషన్ భగీరథ గ్రిడ్ అధికారి పుట్ట వెంకట్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మన్యంకొండ నీటి శుద్ధి కేంద్రం నుంచి నీటి సరఫరా అయ్యే దేవరకద్ర, నారాయణపేట, మక్తల్ అసెంబ్లీ నియోజకవర్గాలలోని 245 గ్రామాల్లో నీటి సరఫరా ఉండదని తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

నేటినుంచి జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలు

కోస్గి: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నేటినుంచి 26వరకు జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలు కొనసాగనున్నాయి. ఈ మేరకు అండర్‌–19 విభాగంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో బాలురకు నిర్వహిస్తున్న ఈ పోటీలకు అన్ని రాష్ట్రాల నుంచి 550మంది క్రీడాకారులు, 100మంది కోచ్ మేనేజర్లు టోర్నమెంట్ ఆర్గనైజర్ బాల్‌రాజ్ తెలిపారు. ఆయా రాష్ట్రాల కోచ్‌లు తమ క్రీడాకారుల వివరాలు నమోదు చేయిస్తున్నారు. ఏర్పాట్లను తహసీల్దార్ శ్రీనివాసులు పరిశీలించారు.

రేపు జాతీయ రైతు దినోత్సవం

నారాయణపేట: గ్రామభారతి, జ్ఞాననేత్ర నేచర్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ శాఖ సహకారంతో జాతీయ రైతు దినోత్సవాన్ని సోమవారం ఉదయం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు శనివారం నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్‌చే ప్రకృతి సేద్యం చేస్తున్న కొంత మంది రైతులను సన్మానించడం, ప్రకృతి సేద్య నిపుణుల సలహాలు అందించడం, రైతుల అనుభవాలు పంచుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని ప్రకృతి సేద్య రైతులతో పాటు ఈ సేద్యం పై ఆసక్తి ఉన్న రైతులు తప్పకుండా హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ సిక్తాపట్నాయక్, ఎమ్మెల్యేలు పర్ణికారెడ్డి , శ్రీహరి, ప్రకృతి సేద్య నిపుణులు విజయరాం, వక్త మదన్ గుప్తా హాజరవుతున్నట్లు తెలిపారు.

పకడ్బందీగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

మరికల్: ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల సర్వే పకడ్బందీగా చేపట్టాలని.. అనంతరం వారి ఎంపిక జరుగుతుందని జిల్లా అధికారి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని మరికల్, వెంకటాపూర్ గ్రామాల్లో శనివారం ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. సిబ్బందికి నిర్దేశించిన సమయంలోపు సర్వేను పూర్తి చేసి వివరాలను అందజేయాలని అధికారులకు సూచించారు కార్యక్రమంలో ఎంపీడీఓ కొండన్న, ఎపీఓ పావని పాల్గొన్నారు.

నేడు ఆర్‌ఎల్‌డీ డిగ్రీ కళాశాల స్వర్ణోత్సవాలు

వనపర్తి విద్యావిభాగం: వనపర్తి ఆర్‌ఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వర్ణోత్సవ వేడుకలను ఆదివారం నర్సింగాయపల్లి సమీపంలో నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్, స్వర్ణోత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు రఘునందన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల ప్రారంభం 1974 నుంచి ఇప్పటి వరకు పనిచేసిన అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, కళాశాలలో చదివిన విద్యార్థులు అందరిని కార్యక్రమానికి ఆహ్వానించామని పేర్కొన్నారు. కళాశాలలో విద్యాబుద్ధులు నేర్చుకున్న అందరూ కలిసి కళాశాలకు గొప్ప వైభవం తీసుకొచ్చే ఉద్దేశంతో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో స్వర్ణోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉదయం 9 గంటలకు కార్యక్రమాలు ప్రారంభమవుతాయని.. ముఖ్యఅతిథులుగా హైకోర్టు మాజీ న్యాయమూర్తి, తెలంగాణ రెగ్యులేటరీ కమిటీ చైర్మన్ నాగార్జున, కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్ పాల్గొంటారని పేర్కొన్నారు.

శనైశ్వరుడికి శాస్త్రోక్తంగా పూజలు



బిజినేపల్లి: నందివడ్డెమాన్‌లో శనివారం జ్యేష్ఠాదేవి సమేత శనైశ్వరుడికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకొని తమ ఏలినాటి శనిదోష నివారణ కోసం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి ఆధ్వర్యంలో గోత్రనామార్చన చేశారు. శివాలయాన్ని సందర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

దక్షిణ భారతదేశ సైన్స్‌మేళాలో..: గణిత ఉపాధ్యాయురాలు అనిత

మల్దకల్ మండలం అమరవాయి జెడ్పీహెచ్‌ఎస్ గణిత ఉపాధ్యాయురాలు అనిత బోధనలో మేటిగా నిలుస్తున్నారు. గణితంలోని అంశాలు అమూర్త భావనలు అనగా మూర్త వస్తువులతో బోధించడంతో విద్యార్థులు గణితశాస్త్రంపై భయం లేకుండా విద్యనభ్యసిస్తున్నారు. వస్తువుల రూపంలో ప్రయోగాత్మకంగా వివరిస్తున్నారు. వీటితో పాటు గణితంలోని ఆకారాలను సులువుగా నేర్చుకునేందుకు డిజిటల్ టెక్నాలజీ ఉపయోగిస్తున్నారు. 2020 చెన్నైలోని సత్యభామ యూనివర్సిటీలో నిర్వహించిన సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కు ఉపాధ్యాయ విభాగంలో పాల్గొని ప్రతిభ చాటారు. దక్షిణ భారతదేశ సైన్స్‌మేళాలో జిల్లా నుంచి పాల్గొన్న **ఏకైక ఉపాధ్యాయురాలిగా నిలిచారు.**



గణిత పాఠ్యపుస్తక రచయితగా..

గణితం అంటే చాలామంది విద్యార్థులకు భయం. కానీ, అందులోని సూత్రాలు తెలిస్తే అన్ని సబ్జెక్టులకంటే ఎంతో సులువైనదని చెబుతున్నారు గణిత బోధకుడు వరద సుందర్‌రెడ్డి. ఉండవెల్లి మండలం తక్కశిల జెడ్పీహెచ్‌ఎస్‌లో గణిత బోధకుడిగా పనిచేస్తున్నారు. 22ఏళ్ల సర్వీసులో మొదటి ఏడాది తప్ప మిగిలిన 21 సంవత్సరాల నుంచి గణిత సబ్జెక్టులో ఒక్క విద్యార్థి కూడా ఫెయిల్ కాలేదు. ప్రస్తుతం వాడుకలో ఉన్న 6, 7, 8, 9వ తరగతి గణిత పాఠ్యపుస్తక రచయితగా సేవలు అందిస్తున్నారు. ఉమ్మడిజిల్లాలో ఉన్న ఏకైక పాఠ్య పుస్తక రచయిత ఈయనే కావడం గర్వకారణం. సృజనాత్మకంగా, ప్రయోగాత్మకంగా, వినూత్న బోధన పద్ధతులతో విద్యార్థులను గణితం **వైపు ఆకర్షించేలా బోధన అందిస్తు మేటిగా నిలుస్తున్నారు.**



సులభ పద్ధతులతో గణితం బోధిస్తున్న వరదసుందర్‌రెడ్డి

గణితంలో ఘనులు

- రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రదర్శనలు.. గుర్తింపు
- కల్వకుర్తి మండలం మార్చాల ప్రభుత్వ పాఠశాలలో మ్యాథ్స్ రూం
- విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా ప్రాజెక్టులు
- నేడు జాతీయ గణిత దినోత్సవం

అంకెలతో ఆట.. సూత్రాలతో లెక్కల వేట

మార్కులు, గ్రేడ్లు, ర్యాంకులే లక్ష్యం కాకుండా, నూతన ఆవిష్కరణల వైపు అడుగులు వేసేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు పలువురు ఉపాధ్యాయులు. విద్యార్థులు క్లిష్టమైన సబ్జెక్టుగా భావించే గణితాన్ని సులభంగా అర్థమయ్యేలా బోధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. అతి సులభంగా గణితంలో మెళకువలను నేర్పిస్తూ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపుతూ లెక్కలపై ఉన్న భయాన్ని పోగొడుతున్నారు. ఆదివారం గణిత దినోత్సవం (శ్రీనివాస రామానుజన్ జయంతి) సందర్భంగా ఈ వారం సండే స్పెషల్..

– సాక్షి, నాగర్‌కర్నూల్/మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్/గద్వాల టౌన్





సండే స్పెషల్

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



మార్చాల జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన పదో తరగతి విద్యార్థిని ఐశ్వర ఇటీవల రాష్ట్ర స్థాయి సైన్స్ ఫేర్ పోటీలకు ఎంపికైంది. అతి క్లిష్టమైన 'మ్యాథమెటికల్ మోడలింగ్ అర్థమెటిక్ టు అల్గారిథమ్ వయా ఆల్జిబ్రా' అనే అంశాన్ని ప్రదర్శించింది. క్వాడ్రటిక్ ఈక్వేషన్‌ను పరిష్కరించేందుకు ఇప్పటివరకు మూడు మెథడ్‌లు ఉండగా, ఐశ్వర్య నాలుగో మెథడ్‌ను తయారు చేయడం విశేషం. మ్యాథ్స్ విభాగంలో ప్రతిభ చూపినందుకు మార్చాల పాఠశాలకు చెందిన ఐశ్వర్యతో పాటు మరో ఐదుగురు విద్యార్థులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ ఎగ్జామినేషన్(ఎన్‌ఎంఎంఎస్) నుంచి ఏటా రూ.12,500 చొప్పున స్కాలర్‌షిప్‌ను అందుకుంటున్నారు. ఐదేళ్లకాలం పాటు ఈ స్కాలర్‌షిప్ విద్యార్థులకు అందుతుంది.

ఉపకార వేతనాలు పొందేలా..



పాలమూరులోని మోడల్ బేసిక్ పాఠశాల గణిత ఉపాధ్యాయుడు ఫసియొద్దీన్ ఎన్‌ఎంఎంఎస్‌కు సిద్ధమయ్యే విద్యార్థులకు ప్రత్యేక తరగతులు బోధిస్తున్నారు. ఫలితంగా గతేడాది ఏకంగా 13 మంది విద్యార్థులు స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యారు. ఈ విధంగా ఉపాధ్యాయుడు ఫసియొద్దీన్ అందరి మన్ననలు పొందుతున్నారు. భవిష్యత్‌లో మరిన్ని తరగతులు నిర్వహించి విద్యార్థులు స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు ఆయన వివరించారు.

మార్చాలలో మ్యాథ్స్ రూం

కల్వకుర్తి మండలం మార్చాల ప్రభుత్వ పాఠశాలలో ఉమ్మడి జిల్లాలోనే తొలిసారిగా మ్యాథమెటికల్ ల్యాబ్ ఏర్పాటైంది. సైన్స్‌లో విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జ్ తరహాలోనే గణితానికి సంబంధించిన ఆవిష్కరణలకు ఈ ల్యాబ్ ప్రాక్టికల్‌గా విద్యార్థులు అనుభూతి పొందేందుకు వీలు కలుగనుంది. గణితంలో క్లిష్టమైన అంశాలను అతి సులువుగా విద్యార్థులకు బోధించేందుకు వీలుగా ఈ ల్యాబ్‌ను ఉపాధ్యాయుడు కూన శ్రీనివాసులు రూపొందించారు. 85 రకాల క్లిష్టమైన అంశాలను ఈ ల్యాబ్‌లో పొందుపర్చారు. ఒక్కో కాన్సెప్ట్‌ను పది నిమిషాల చొప్పున వివరించడం ద్వారా విద్యార్థులకు ప్రాక్టికల్‌గా అర్థం చేసుకోవడం సులువు అవుతుంది. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు అవసరమైన మ్యాథమెటికల్ కాన్సెప్ట్‌లు ఇందులో ఉంటాయి. టేబుల్స్, అల్గారిథమ్స్, అర్థమెటిక్ అంశాలను అతి సులువుగా విద్యార్థులకు బోధించేలా మ్యాథ్స్ ల్యాబ్‌ను రూపొందించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో గోల్డ్ మెడల్ పొందిన శ్రీనివాసులు విద్యార్థులకు వినూత్న పద్ధతిలో గణితం బోధిస్తున్నారు.



కల్వకుర్తి మండలం మార్చాలలో ఏర్పాటు చేసిన మ్యాథ్స్ ల్యాబ్

ఫిన్‌లాండ్ స్ఫూర్తితో విద్యార్థులకు బోధన..



విద్యార్థులకు ఒత్తిడి లేకుండా, సులువుగా విద్యను అందించడంలో ఫిన్‌లాండ్ దేశం ముందువరుసలో ఉంది. అక్కడ మాథ్స్, సైన్స్ విద్యాబోధనలో అమలవుతున్న విధానాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఇక్కడి విద్యార్థుల కోసం మాథ్స్ ల్యాబ్ రూపొందించాను. గణితం పట్ల విద్యార్థుల్లో భయం పోగొట్టేలా సులువైన విధానంలో బోధిస్తున్నాను. ఈ విధానంలో విద్యార్థులు జాతీయ, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపుతుండటం ఆనందాన్ని కలిగిస్తోంది.

– కూన శ్రీనివాసులు, గణిత ఉపాధ్యాయుడు, మార్చాల

మ్యాథ్స్ పార్క్‌తో సులభంగా..



సైన్స్ ప్రదర్శనలో మ్యాథ్స్ పార్క్ ప్రదర్శిస్తున్న అలేఖ్య, హిమశ్రీ

సులభంగా గణిత ప్రక్రియలు నేర్చుకునేందుకు వీలుగా మహబూబ్‌నగర్‌లోని నాగార్జున పాఠశాల విద్యార్థులు అలేఖ్య, హిమశ్రీలు మ్యాథ్స్ పార్కులు ఆవిష్కరించారు. పార్కులో ఆడుకుంటూ అక్కడ ఉండే ఒక్కో ఆట వస్తువుతో ఒక్కో విధమైన గణిత ప్రక్రియ ఏర్పాటు చేశారు. వీటి ఆధారంగా వివిధ గణిత సూత్రాలు, ప్రక్రియలు, చతుర్విత ప్రక్రియలు, లెక్కలు నేర్చుకునేందుకు అవకాశం ఉందని విద్యార్థులు పేర్కొన్నారు. దీని ఆధారంగా పార్క్‌లను ఏర్పాటు చేస్తే విద్యార్థులు మర్చిపోకుండా గణితం చేర్చుకుంటారని అభిప్రాయపడుతున్నారు. ఈ మేరకు ఇటీవల ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సైన్స్ ప్రదర్శనలో విద్యార్థులు ప్రతిభచాటారు.

అబాకస్‌లో ప్రపంచ రికార్డు



ప్రపంచ రికార్డు సాధించిన విద్యార్థులు

నారాయణపేట రూరల్: పెన్ను, పేపర్ లేకుండా కేవలం మెదడుకు పని చెప్పి.. గణితంలో సమాధానాలు చెప్పే విధానమైన అబాకస్‌లో అతివేగంగా అత్యధిక ప్రశ్నలకు సమాధానాలు చెప్పి ప్రపంచ రికార్డు సాధించారు నారాయణపేట చిన్నారులు. స్థానిక సింగార్‌బేస్ వీధిలో శిక్షకురాలు రీతు ప్రైవేటుగా కొద్దిరోజులుగా అబాకస్‌లో పిల్లలకు శిక్షణ ఇస్తుంది. ఈ క్రమంలో రెండేళ్ల క్రితం పట్టణానికి చెందిన చరణ్, వైభవ్, ప్రణవి ఐరేంజ్ సంస్థ వారు 2023లో ప్రపంచవ్యాప్తంగా నిర్వహించిన పోటీలకు దరఖాస్తు చేసుకోగా పరీక్షలో పాల్గొనేందుకు అనుమతి ఇచ్చింది. ఈ క్రమంలో ఆయా విద్యార్థులకు సంబంధించిన వీడియోలను వెబ్‌సైట్‌కు అప్‌లోడ్ చేయగా, నిర్వాహకులు చూసి ఆన్‌లైన్‌లో లైవ్‌గా వీరి ప్రతిభను పరిశీలించారు. అవాక్కైన వారు హైదరాబాద్ కార్యాలయానికి పిలిపించి పది డిజిట్‌లకు సంబంధించిన వంద ప్రశ్నలను వేయగా పెన్ను, పేపర్ లేకుండా ఒక్క నిమిషంలోనే సమాధానాలు చెప్పారు. దీంతో వారిని అబాకస్‌లో అర్థమేటిక్ క్యాలిక్యులేషన్ ప్రక్రియలో ప్రపంచ రికార్డు సాధించినట్లు ప్రకటించి ప్రశంసాపత్రాలు అందించారు. దీనిపై శిక్షకురాలు రీతు మాట్లాడుతూ.. గణితంపై భయాన్ని పోగొట్టేందుకు తాను తర్ఫీదు పొందిన అబాకస్‌ను పట్టణంలోని చిన్నారులకు అందిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికి వందల మంది విద్యార్థులు నేర్చుకున్నారని, ముందుందు మరింత మందికి అందించేందుకు ప్రయత్నిస్తానని పేర్కొన్నారు.

సమ్మెలో గురువులు.. సాగని చదువులు



మరికల్ కేజీబీవీ వద్ద విద్యార్థినుల తల్లిదండ్రుల ఆందోళన

- కేజీబీవీల్లో నిలిచిన విద్యా బోధన
- ముంచుకొస్తున్న పదో తరగతి, ఇంటర్ వార్షిక పరీక్షలు..
- ఇంకా పూర్తికాని సిలబస్
- ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు

మరికల్: సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె బాట పట్టడంతో కేజీబీవీ పాఠశాలల్లో చదువులు సాగడంలేదు. దీనికితోడు శనివారం జిల్లా వ్యాప్తంగా కేజీబీవీ పాఠశాలల్లో విద్యార్థినుల తల్లిదండ్రుల సమావేశం ఉండగా, ఉద్యోగులు సమ్మెలో ఉండటంతో ఈ సమావేశాలు రద్దు చేశారు. 15 రోజుల నుంచి కేజీబీవీలో పాఠాలు చేప్పే వారు లేక ఏం చదవాలో అర్థం కావడం లేదంటూ విద్యార్థినులు వారి తల్లిదండ్రుల ఎదుట ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదో తరగతి, ఇంటర్ వార్షిక పరీక్షల సమయం సమీపిస్తున్న వేళ సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మెకు దిగ్గడంతో కేజీబీవీల్లోని విద్యార్థినుల చదువులు అయోమయంలో పడ్డాయి. అంతేకాకుండా బాలికలకు రక్షణ, అల్పాహారం భోజనం అందించడానికి ఇద్దరు మినహా మిగతావరంతా సమ్మెలో ఉండడం గమనార్హం. జిల్లాలో మొత్తం 450 మంది ఉద్యోగులు నారాయణపేటలో శిబిరాన్ని ఏర్పాటు చేసి నిరసనలు చేస్తున్నా ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని వారంతా వాపోతున్నారు. నిరవధిక సమ్మె ఇప్పటికే 15 రోజులు దాటింది.

విద్యార్థినుల భవిష్యత్‌పై ప్రభావం

ఫిబ్రవరి మూడో తేదీ నుంచి ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్స్, మార్చి 5 నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మార్చి 21 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు మొదలవుతాయి. పెండింగ్ సిలబస్ పూర్తి చేసి పరీక్షలకు సన్నద్ధం చేయడానికి ఇదే కీలక సమయం. కానీ, చదువు చెప్పే వారే సమ్మెలో ఉండడంతో విద్యార్థుల భవిష్యత్‌పై సమ్మె ప్రభావం పడబోతోంది. ఇక్కడి పరిస్థితులను ఉన్నతాధికారులకు చెప్పాలనుకున్నా మండల వనరుల కేంద్రాలు సైతం మూత పడటంతో ఏం చేయలేని పరిస్థితి ఏర్పడింది.

ప్రత్యామ్నాయం మాటేమిటి..?

సమ్మె నేపథ్యంలో ఎంఈఓలు కేజీబీవీలను సందర్శిస్తున్నారు. బాగా చదువుకోవాలని వార్షిక పరీక్షల్లో వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని హితబోధ చేస్తున్నారు. ప్రత్యామ్నాయం గురించి మాత్రం ఆలోచించడం లేదు. కేజీబీవీలకు దగ్గరలోని పాఠశాలల ఉపాధ్యాయులను బోధనకు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. ఇప్పటికే జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు గురుకులాల్లో విద్యార్థినులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.



పదో తరగతి విద్యార్థులకు సలహాలు ఇస్తున్న ఎంఈఓ

పాఠాలు చెప్పడం లేదంట..



నా కూతురు మరికల్ కేజీబీవీలో పదో తరగతి చదువుతోంది. 15 రోజుల నుంచి ఉపాధ్యాయులు సమ్మెలో ఉండటంతో పాఠాలు చెప్పడంలేదంట. పరీక్షలకు సిద్ధం కావాల్సిన అంశాలను వివరించే వారు లేకపోతే ఎలా ఉత్తీర్ణత అవుతారు. తమ పిల్లలు ఉత్తీర్ణత కాకుంటే దీనికి ఎవరూ బాధ్యత వహిస్తారు. ఉన్నతాధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి.

– చంద్రకళ, పదో తరగతి విద్యార్థిని తల్లి

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



పదో తరగతి, ఇంటర్ విద్యార్థినుల పరీక్షలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సమ్మెలో ఉన్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి విద్యార్థులకు నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలి. వార్షిక పరీక్షల సమయం దగ్గర పడుతున్న సమయంలో సిలబస్ పూర్తికాక విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. సమ్మె ఇలాగే కొనసాగితే విద్యార్థులు త్రీవంగా నష్టపోయే అవకాశం ఉంది.

– రాంరెడ్డి, పదో తరగతి విద్యార్థిని తండ్రి, పూసల్‌పహాడ్

నష్టం కలగకుండా చూస్తాం

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేది రాష్ట్ర ప్రభుత్వం చేతుల్లో ఉంది. ప్రస్తుతం పదో తరగతి, ఇంటర్ పరీక్షలు దగ్గర పడుతుండటంతో ఉన్న వనరులను ఉపయోగించుకుంటాం. కేజీబీవీలో అందుబాటులో ఉన్న డిజిటల్ తరగతులను నిర్వహిస్తాం. ఇందుకుగాను ఉపాధ్యాయులను సర్దుబాటు చేసేందుకు ఎంఈఓలను ఆదేశించడం జరిగింది. విద్యార్థులకు నష్టం కలగకుండా చూస్తాం.

– గోవిందరాజులు, డీఈఓ

జీఓ 317 బాధితులకు న్యాయం చేయాలి



పోస్టర్ విడుదల చేస్తున్న జంగయ్య తదితరులు

నారాయణపేట రూరల్: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ 317 బాధితులకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేసి న్యాయం చేయాలని రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.జంగయ్య డిమాండ్ చేశారు. శనివారం నారాయణపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జీఓ 317 సమస్యలపై దాటవేత వైఖరి పట్ల రాష్ట్రంలోని ఉపాధ్యాయులంతా తీవ్రంగా నిరసిస్తున్నారని, బాధితులందరికీ న్యాయం చేస్తామని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్నారని గుర్తు చేశారు. భార్యాభర్తలు, ఆరోగ్య కారణాలతో బదిలీలకు జీఓలోనే అవకాశం ఉందని, స్థానికత కోల్పోయిన వారి గురించి నిర్ణయం చేయకపోవడం తీవ్ర నిరాశకు గురి చేసిందని బాధితులందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేయాలి. అదేవిధంగా ప్రభుత్వ హామీ మేరకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు క్లియర్ చేయాలని ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని అన్నారు. ఈ నెల 28, 29, 30 తేదీల్లో నల్గొండలో జరిగే రాష్ట్ర మహాసభలకు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. కె.రవికుమార్, కె.శివరాములు, కె.బాలాజీ కోశాధికారి భీమయ్య,కృష్ణగౌడ్, రవికుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

- ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ సత్యనారాయణ



ఉండవెల్లి: మండలంలోని భైరాపురం శివారు అలంపూర్ రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పంచాయతీ కార్యదర్శి దస్తగిరి ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ సుబ్బారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఏఎస్ఐ వివరాల ప్రకారం.. భైరాపురం శివారు అలంపూర్ రైల్వే స్టేషన్ సమీప రోడ్డుమార్గంలో గుర్తు తెలియని వ్యక్తి(60) మృతదేహం లభ్యమైంది. అతని వంటిపై తెల్ల బనిగిన్, తలబాగంలో గాయాలు, ఎడమ చేతి వేలుకు సిల్వర్ ఉంగరం, తలకు ఎర్రటి, నల్లటి వెంట్రుకలు ఉన్నాయి. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ సత్యనారాయణ, అలంపూర్ ఎస్ఐ వెంకటస్వామి, ఇటిక్యాల ఎస్ఐ వెంకటేష్, ఉండవెల్లి ట్రైనింగ్ ఎస్ఐ సతీష్‌రెడ్డి పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి దస్తగిరి ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మృతదేహం లభ్యం

జడ్చర్ల టౌన్: పుర పరిధిలోని క్లబ్‌రోడ్డు బీసీ వసతిగృహం వెనక నీటికుంటలో శనివారం మధ్యాహ్నం బుడగ జంగం బంగారయ్య (16) మృతదేహం లభించినట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించామన్నారు. తల్లి బంగారమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని.. 5 రోజుల కిందట శ్లోక స్కూల్ సమీపంలో ఉన్న నీటికుంట వద్దకు వెళ్లి అందులో పడి మృతిచెంది ఉంటాడని వివరించారు.

కుక్కను తప్పించబోయి.. చెట్టును ఢీకొన్న బైక్

- యువకుడు మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు

మన్ననూర్: మన్ననూర్ సమీపంలోని లింగమయ్య స్వామి ఆలయం వద్ద శ్రీశైలం–హైద్రాబాద్ ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందగా మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. సంగారెడ్డి జిల్లాకు చెందిన అరవింద్, మహబూబ్‌నగర్ జిల్లా గండేడ్‌కు చెందిన ఈశ్వర్ ఇద్దరూ కలిసి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి బైక్‌పై బయలుదేరారు. ఈ క్రమంలో శనివారం రాత్రి మన్ననూర్ లింగమయ్యస్వామి ఆలయం సమీపంలో అకస్మాత్తుగా కుక్క బైక్‌కు అడ్డంగా రావడంతో దానిని తప్పించే క్రమంలో బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కనున్న చెట్టును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న అరవింద్(25) అక్కడికక్కడే మృతిచెందగా.. వెనక కూర్చున్న ఈశ్వర్‌కు తీవ్రగాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అమ్రాబాద్ పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

నాగర్‌కర్నూల్ క్రైం: అప్పులబాధతో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన నాగర్‌కర్నూల్‌లో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. జిల్లాకేంద్రానికి చెందిన ముత్యాలుకు కొన్ని రోజులుగా అప్పులు ఎక్కువయ్యాయి. వాటిని తీర్చలేక మనస్తాపానికి గురై ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు.

'ఉమామహేశ్వర' నిర్మాణ పనులు ఆపాలి

- రైతులతో చర్చించకుండా ఎమ్మెల్యే ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణ
- మరో లగచర్ల ఘటన పునరావృతం అవుతుందని హెచ్చరిక



నినాదాలు చేస్తున్న రైతులు

బల్మూర్: భూమినే నమ్ముకొని తరతరాలుగా జీవనం సాగిస్తున్న తమ బతుకుల్లో ఉమామహేశ్వర రిజర్వాయర్ గుదిబండగా మారి రోడ్డున పడేస్తోందని నిర్వాసిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూముల్లో బలవంతంగా సర్వేలు చేసి నిర్మాణ పనులు చేపడితే మరో లగచర్ల ఘటన పునరావృతం అవుతుందని హెచ్చరించారు. శనివారం బల్మూర్‌లోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉమామహేశ్వర రిజర్వాయర్ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వాసిత రైతులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోరాట సమితి అధ్యక్షుడు సీతారాంరెడ్డి, నాయకులు తిరుపతయ్య, ఇంద్రారెడ్డి, చంద్రయ్య, జానకిరాములు తదితరులు మాట్లాడారు. ప్రాజెక్టు నిర్మాణంతో బల్మూర్, అనంతవరం, మైలారం, అంబగిరి గ్రామాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన సన్నకారు రైతుల భూములు సుమారు రెండు వేల ఎకరాలు ముంపునకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గోడును ప్రభుత్వం పట్టించుకోకుండా కేవలం నష్ట పరిహారంతో సరిపెట్టి రోడ్డున పడేయాలని చూస్తోందని మండిపడ్డారు. తమ బతుకులను ఛిద్రం చేసే రిజర్వాయర్ పనులను పోరాటం ద్వారా అడ్డుకుంటామని.. ప్రాణత్యాగానికైనా వెనుకాడమని హెచ్చరించారు. పైప్‌లైన్ ద్వారా గొలుసుకట్టు చెరువులను నీటితో నింపి రైతుల భూములకు నష్టం కలగకుండా చూస్తామని ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ హామీ ఇచ్చి.. నేడు ప్రాజెక్టు నిర్మాణానికి రైతులు సుముఖంగా ఉన్నారని, రైతులతో ముఖాముఖి నిర్వహించానని చెప్పడమే కాకుండా ఎవరు అడ్డొచ్చినా నిర్మించి తీరుతామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రాజెక్టు నిర్మాణంపై ఇప్పటి వరకు ఎమ్మెల్యే రైతులతో చర్చించిన దాఖలాలు లేవని ఆరోపించారు. భూ సేకరణ చట్టం ప్రకారం రైతుల నుంచి బలవంతగా భూములు లాక్కొనే అధికారం ఎవరికీ లేదని.. నిర్వాసిత రైతులకు భూమికి భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రైతుల మేలు కోరి ప్రాజెక్టు పనులు నిలిపి వేయాలని కోరారు.

ప్రాజెక్టుతో ఎవరికి ప్రయోజనం..

ఉమామహేశ్వర ప్రాజెక్టు నిర్మాణంతో ఇక్కడి రైతులకు ఏ మాత్రం ప్రయోజనం లేదని పోరాట సమితి నాయకులు తెలిపారు. ఇతర మండలాలకు సాగునీరు తరలించేందుకు ఈ ప్రాంత రైతుల భూములు నష్టపోయినా ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దీనిపై త్వరలోనే ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రైతులు తమ డిమాండ్లను అంగీకరించాలని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వెంటనే కాల్వల సర్వే పనులు నిలిపివేయాలని లేకుంటే అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రిజర్వాయర్ వ్యతిరేక పోరాట సమితి నాయకులు రఘుమారెడ్డి, శ్రీను, కాలూరి రాజాబాబు, రామచంద్రారెడ్డి, నీలమ్మ, జానకిరాములు, జైపాల్‌రెడ్డి, బాలస్వామి, బక్కయ్య, రైతులు పాల్గొన్నారు.


జడ్చర్లలో దొంగల హల్‌చల్

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని గౌరిశంకర్‌కాలనీ రోడ్ నెం.3లో శుక్రవారం అర్ధరాత్రి 1గంట నుంచి 2గంటల వరకు ఇద్దరు దొంగలు హల్‌చల్ చేసిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. ముఖానికి ముసుగు వేసుకున్న దొంగలు రెండు ఇళ్ల తాళాలు పగులగొట్టి దొంగతనానికి యత్నించారు. ఫార్మకంపెనీ ఉద్యోగి ఇంట్లో ఎలాంటి విలువైన వస్తువులు, నగలు, నగదు లేకపోవటంతో దొంగలు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఎదురుగా ఉన్న మరో ఇంట్లోకి చొరబడి అక్కడ ఏం చేశారనేది ఇంటి యజమానులు వస్తేగాని తెలియదు.



కాలి బూడిదైన ఆశలు

షార్ట్ సర్క్యూట్‌తో రెండు గుడిసెల దగ్ధం



గుర్లపల్లిలో దగ్ధమవుతున్న గుడిసెలు

- కొత్త ఇంటి నిర్మాణం, అప్పుల కోసం దాచుకున్న రూ.15 లక్షల నగదు అగ్గిపాలు
- రోడ్డున పడిన నిరుపేద కుటుంబాలు

మక్తల్: వారిద్దరు అన్నదమ్ముళ్లు.. గుడిసెల్లో ఉంటూ కూలీ పనులు చేసుకోవడంతో పాటు మేకలు పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరిలో ఒకరు చేసిన అప్పులను తీర్చేందుకు.. మరొకరు కొత్త ఇంటిని నిర్మించుకునేందుకు ఇటీవల మేకలను విక్రయించారు. ఆ డబ్బును గుడిసెల్లో పెట్టి దేవుడి మొక్కు చెల్లించుకునేందుకు వెళ్లగా.. షార్ట్ సర్క్యూట్‌తో రెండు గుడిసెలకు నిప్పంటుకొని వారి ఆశలు కాలిబూడిదయ్యాయి. ఈ ఘటన మక్తల్ మండలం గుర్లపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గుర్లపల్లికి చెందిన నందిగొండ మొగులయ్య, నందిగొడ సందప్ప పక్కపక్కనే రెండు గుడిసెల్లో నివాసముంటూ కూలీ పనులు చేసుకోవడంతో పాటు మేకలు పెంచుకొని జీవనం సాగిస్తున్నారు. ఇటీవల మొగులప్ప మేకలు విక్రయించగా రూ.7 లక్షలు, సందప్ప మేకలకు రూ.8 లక్షలు వచ్చాయి. ఆ డబ్బును గుడిసెలో పెట్టి, కుటుంబ సమేతంగా మక్తల్ పడమటి ఆంజనేయ స్వామిని దర్శించుకునేందుకు వెళ్లారు. ఈ క్రమంలో ఓ గుడిసెలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు చెలరేగాయి. ఫైరింజన్ వచ్చినప్పటికీ ఫలితం లేకపోయింది. విషయం తెలుసుకున్న బాధిత కుటుంబాలు గ్రామానికి చేరుకునే లోపే రెండు గుడిసెలు కాలిపోయాయి. గుడిసెలో పెట్టిన డబ్బుతో పాటు భూమి పట్టాదారు పాస్‌పుస్తకాలు, పిల్లల సర్టిఫికెట్లు, దుస్తులు, వంట సామగ్రి మొత్తం కాలిబూడిదయ్యాయి. కష్టపడి సంపాదించిన సొమ్ము అగ్గిపాలు కావడంతో బోరున విలపించారు. తాము రోడ్డున పడ్డామని.. ప్రభుత్వపరంగా ఆదుకోవాలని వేడుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఆర్ఐ భూపాల్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అనంతరం మక్తల్ పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు.

మమ్మల్ని ఆదుకోండి..



మాది పేద కుటుంబం. మేకలు కాసుకొని బతుకుతున్నాం. ఉన్న అప్పులను తీర్చేందుకు కొన్ని రోజుల క్రితం మేకలు అమ్మగా.. రూ.7 లక్షలు వచ్చాయి. ఆ డబ్బును గుడిసెలో పెట్టి మొక్కు చెల్లించుకునేందుకు మక్తల్‌కు వెళ్తే అగ్నిపాలయ్యాయి. కట్టుబట్టలతో మిగిలి బజారులో పడ్డాం. మమ్మల్ని ఆదుకోవాలి.

– నందిగొండ మొగులయ్య, బాధితుడు, గుర్లపల్లి

రోడ్డున పడ్డాం..



మా గుడిసెలోని వస్తువులన్నీ కాలిపోయాయి. కొత్తగా ఇంటిని కట్టుకుందామని మేకలు అమ్ముకున్నాను. గుడిసెతో పాటు రూ. 8 లక్షల నగదు, బట్టలు, వంట సామగ్రి మొత్తం అగ్నిపాలయ్యాయి. రోడ్డున పడ్డాం. ప్రభుత్వం ఆదుకోవాలి.

– నందిగొండ సందప్ప, బాధితుడు, గుర్లపల్లి

మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డికి పితృ వియోగం



నేరళ్లపల్లిలో మర్రి జంగిరెడ్డి అంతిమయాత్ర

- అంత్యక్రియలకు హాజరైన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు

తిమ్మాజిపేట: నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి తండ్రి మర్రి జంగిరెడ్డి కొంతకాలంగా అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్సపొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతిచెందారు. శనివారం మర్రి జనార్దన్‌రెడ్డి స్వగ్రామం నేరళ్లపల్లిలో ఇంటి నుంచి తన వ్యవసాయ పొలం వరకు జంగిరెడ్డి అంతిమయాత్ర నిర్వహించారు. అశ్రునయనాల మధ్య తనయుడు మర్రి జనార్దన్‌రెడ్డి తండ్రి చితికి నిప్పంటించారు. అంత్యక్రియలకు మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, డాక్టర్ లక్ష్మారెడ్డి, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాల్‌రాజ్, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, అంజయ్య యాదవ్, నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, నాగం శశిధర్‌రెడ్డి, జోగు ప్రదీప్, రాందేవ్ రెడ్డి, జెట్టివెంకటేష్ తదితరులు హాజరయ్యారు. వారు మర్రి జంగిరెడ్డి మృతదేహంపై పూలమాలలు పెట్టి నివాళులర్పించారు.



మర్రి జంగిరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రులు

జోరుగా ఇసుక దందా

- వడ్వాట్ గ్రామ శివారులో భారీగా ఇసుక డంపులు
- చోద్యం చూస్తున్న అధికారులు



వడ్వాట్ గ్రామ శివారులో డంపు చేసిన ఇసుక

మాగనూర్: మండలంలోని పలు గ్రామాల్లో ఇసుకదందా యథేచ్ఛగా సాగుతోంది. కొందరు అక్రమార్కులు వడ్వాట్, అడవిసత్యావార్, మందిపల్లి, గజ్జరందొడ్డి గ్రామాల్లోని వాగుల నుంచి నిత్యం ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తూ అందిన కాడికి దోచుకుంటున్నారు. మాగనూర్ మండల పెద్ద వాగు పరివాహక గ్రామాల్లో దందా జరుగుతున్నా, అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే ఆరోపణలున్నాయి. మాగనూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొందరు పోలీసు సిబ్బంది సహకారంతో వడ్వాట్ గ్రామ శివారులో భారీ మొత్తంలో ఇసుక దందా నడుస్తోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రాత్రి జేసీబీ ట్రాక్టర్లతో గ్రామ శివారులో ఇసుక డంపులు చేసి తెల్లవారుజామున టిప్పర్లతో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత రెవెన్యూ, పోలీసు అధికారులు స్పందించి మండలంలోని ఇసుక అక్రమ దందాపై ఉక్కుపాదం మోపాలని సమీప పొలాల రైతులు కోరుతున్నారు.



వరిధాన్యం నిల్వను పరిశీలిస్తున్న అధికారులు

వడ్ల డీసీఎం సీజ్

కొత్తకోట రూరల్: ప్రభుత్వం నుంచి కొనుగోలు చేసిన వడ్లను అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న డీసీఎంను అధికారులు పట్టుకొని సీజ్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. కొత్తకోట మండలం మిరాసిపల్లి గ్రామ సమీపంలోని ఇషాన్ ట్రేడర్స్ రైస్‌మిల్లు నుంచి ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేసిన వడ్లను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారన్న సమాచారం మేరకు శుక్రవారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటేశ్వర్లు, జిల్లా పౌరసరఫరాల అధికారి రైస్‌మిల్లుకు చేరుకొని వరిధాన్యం తరలించేందుకు సిద్ధంగా ఉన్న డీసీఎంను సీజ్‌చేసి, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారి ఆదేశాల మేరకు శనివారం స్థానిక తహసీల్దార్ ఎం.వెంకటేశ్వర్లు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ కిషోర్ శనివారం ధాన్యం నిల్వలను పరిశీలించి, పంచనామా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఇషాన్ ట్రేడర్స్ మిల్లు వారికి 2022–23లో ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసిన వానాకాలం ధాన్యాన్ని కేటాయించగా.. అట్టి ధాన్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం వచ్చినట్లు తెలిపారు. అయితే 2022–23 వానాకాలానికి సంబంధించి మిల్లులో దాదాపు 4,672 బస్తాలు, గ్రామ సమీపంలోని గుట్ట వద్ద దాదాపు 13,703 బస్తాలతో కలిపి మొత్తం 18,375 బస్తాల ధాన్యం నిల్వ ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ ధాన్యాన్ని తరలించేందుకు ఏర్పాటుచేసిన డీసీఎంను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు వివరించారు. రైస్‌మిల్లు యజమాని మధుసూదన్‌రెడ్డి ప్రభుత్వ వడ్లను బయటి మార్కెట్‌లో అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నట్లు గుర్తించినట్లు తహసీల్దార్ తెలిపారు.

బస్సుల్లో డీజిల్ చోరీ.. కేసు నమోదు

ఖిల్లాఘనపురం: పెట్రోల్ బంకులో నిలిపి ఉంచిన రెండు బస్సుల్లో నుంచి డీజిల్ చోరీ జరిగిన ఘటనపై శనివారం కేసునమోదు చేసినట్లు ఎస్ఐ సురేశ్‌గౌడ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండల కేంద్రంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్‌బంకులో శుక్రవారం రాత్రి రెండు నైట్‌హాల్ట్ ఆర్టీసీ బస్సులను డ్రైవర్లు కావలి శాంతయ్య, కొత్తకాపు శ్రీనివాస్‌రెడ్డి నిలిపారు. వాటిలోనే డ్రైవర్లతో పాటు కండక్టర్లు సత్యం, వెంకటేశ్ పడుకున్నారు. శనివారం ఉదయం నిద్రలేచి రోజువారీగా టైర్లలో గాలిని పరిశీలిస్తుండగా డీజిల్ ట్యాంకు మూతలు తెరుచుకొని కనిపించాయి. పరిశీలించగా రెండు బస్సుల ట్యాంకుల్లో ఉన్న సుమారు 372 లీటర్ల డీజిల్ చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కావలి శాంతయ్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ వివరించారు.

ఆగిన బస్సులో రూ.2.95 లక్షలు అపహరణ

రాజాపూర్: ఓ హోటల్ వద్ద భోజనం చేసేందుకు బస్సును ఆపారు. గుర్తుతెలియని దుండగులు రూ.2.95లక్షలు అపహరించిన ఘటన మండలంలోని రంగారెడ్డిగూడ శివారులో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. రాజాపూర్ ఎస్ఐ రవి తెలిపిన వివరాలు.. తమిళనాడు రాష్ట్రం తిరుపూర్ కామరాజ్ నగర్‌కు చెందిన వెంకటేష్ బనియన్ల వ్యాపారం చేస్తున్నాడు. రెండు రోజుల క్రితం హైదరాబాద్‌కు వచ్చి పలు దుకాణాల్లో బనియన్లు సరఫరా చేశాడు. వారినుంచి బనియన్లకు సంబంధించిన రూ.2.95 లక్షలను తీసుకున్నాడు. హైదరాబాద్‌లోని లక్డికాపుల్ నుంచి శుక్రవారం రాత్రి ఓ ప్రైవేటు ట్రావెల్ బస్సులో తిరుపూర్‌కు బయలుదేరాడు. మండలంలోని రంగారెడ్డిగూడ వద్ద హైవేపై ఉన్న ఓహోటల్ వద్ద భోజనం కోసం బస్సును ఆపారు. డబ్బుల బ్యాగ్‌ను తాను కూర్చున్న సీటుపై పెట్టి వెంకటేష్ కూడా భోజనం చేసేందుకు హోటల్‌లోకి వెళ్లాడు. భోజనం చేశాక బస్సులోకి వచ్చి చూడగా బ్యాగ్ కనిపించలేదు. బస్సు మొత్తం వెతికినా బ్యాగ్ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శనివారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. ఒక తెల్లటికారులో గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి చోరీకి పాల్పడినట్లు సీసీ ఫుటేజీల్లో గమనించినట్లు ఎస్ఐ చెప్పారు.

చికిత్స పొందుతూ రైతు మృతి



బాలస్వామి (ఫైల్)

అమరచింత: రైతు బాలస్వామి(42) మూడు రోజుల క్రితం గడ్డిమందు తాగగా.. హైదరాబాద్‌లో చికిత్సపొందుతూ శనివారం మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని శ్రీకృష్ణనగర్‌కు చెందిన గొల్ల బాలస్వామి తన పొలం పక్కన ఉన్న చంద్రన్న అనే రైతు పొలంలోని గెట్టును తొలగించాడంటూ నాలుగు రోజుల క్రితం గొడవపడ్డారు. దీంతో తనకు న్యాయం చేయాలని బాలస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా చంద్రన్న సైతం తనపై, భార్యాపిల్లలపై దాడి చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో బాలస్వామి తన పొలం గెట్టును అక్రమించుకోవడమే కాకుండా తన కుటుంబంపై పోలీసు కేసు పెడతాడా అంటూ మనస్తాపం చెందాడు. మూడు రోజుల క్రితం గడ్డిమందు తాగాడు. చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించగా అక్కడ కోలుకోలేక చికిత్సపొందుతూ మరణించాడు. మృతుడికి భార్య సావిత్రితో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

- మహిళ హత్య కేసును ఛేదించిన షాద్‌నగర్ పోలీసులు
- నిందితుడికి రిమాండ్
- వివరాలు వెల్లడించిన పట్టణ సీఐ విజయ్ కుమార్



వివరాలు వెల్లడిస్తున్న షాద్‌నగర్ పట్టణ సీఐ విజయ్ కుమార్

షాద్‌నగర్ రూరల్: మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు.. ఆమెపై అనుమానం పెంచుకున్నాడు.. కన్నకూతురు ముందే తల్లిపై దాడి చేశాడు. దెబ్బలు తాళలేక మహిళ అక్కడే మృతిచెందింది. విషయం బయటకు తెలిస్తే కటకటాల పాలవుతానని గ్రహించి అక్కడి నుంచి పారిపోయాడు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు వారం రోజుల్లో కేసును ఛేదించి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పట్టణ సీఐ విజయ్‌కుమార్ వివరాలను వెల్లడించారు. నారాయణపేట జిల్లా మక్తల్‌కు చెందిన పావని (35) తన కూతురు జ్యోతిశ్రీతో కలిసి కొంతకాలం క్రితం షాద్‌నగర్‌కు వచ్చింది. పట్టణంలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తూ కూతురుతో కలిసి రైల్వే స్టేషన్, జాతీయ రహదారి సమీపంలో నివసిస్తోంది. కర్నూలు జిల్లా ఆలూర్ మండలం జోలాపూర్ గ్రామానికి చెందిన వడ్డె వెంకటేశ్ షాద్‌నగర్‌లో కూలీ పని చేస్తూ పట్టణంలోని బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో ఉండేవాడు. ఈ నేపథ్యంలో పావనికి వెంకటేశ్‌తో పరిచయం ఏర్పడింది. కొంతకాలం తర్వాత ఇది వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈనెల 15న రాత్రి సమయంలో బుచ్చిగూడ రోడ్డులోని బైపాస్ బ్రిడ్జి కింద నిద్రిస్తున్న పావనితో వెంకటేశ్ గొడవపడ్డాడు. ఈ నెల 14వ తేదీ ఎక్కడికి వెళ్లావని మృతురాలు పావనితో వాగ్వాదానికి దిగాడు. తన సొంత ఊరులో ఉన్న భర్త వద్దకు వెళ్లానని చెప్పడంతో కోపోద్రిక్తుడైన వెంకటేశ్ కర్రతో అమానుషంగా ఆమెపై దాడి చేశాడు. అప్పటికీ పావని మృతి చెందలేదని తెలుసుకుని ఇనుప సలాకతో తల, నుదుటిపై కొట్టడంతో రక్తస్రావమై చనిపోయింది. తల్లిపై దాడి చేస్తుండగా అడ్డు వచ్చిన జ్యోతి శ్రీపై కూడా దాడి చేశాడు. పోలీసులకు తెలిస్తే నేరం బయట పడుతుందని భావించిన వెంకటేశ్ తెల్లవారిన తర్వాత.. నీకు టీ తెస్తా నువ్వు అమ్మ దగ్గరే ఉండు అంటూ జ్యోతిశ్రీకి చెప్పి సొంతూరుకు పారిపోయాడు. మహిళ హత్య కేసుపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితుడిని గుర్తించారు. వెంకటేశ్ కర్నూలులో ఉన్నట్లు సమాచారం రావడంతో అక్కడికి వెళ్లి అతన్ని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తమదైన శైలిలో విచారించగా నేరం అంగీకరించాడు. హత్యకు ఉపయోగించిన కర్ర, ఇనుప సలాక(సీకు)ను స్వాధీనం చేసుకున్న పోలీసులు వెంకటేశ్‌ను రిమాండ్‌కు తరలించారు. సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, డీసీపీ రాజేశ్, అడిషనల్ డీసీపీ రామ్‌కుమార్ పర్యవేక్షణ, ఏసీపీ రంగస్వామి ఆధ్వర్యంలో పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి నిందితుడిని పట్టుకున్నారు. కేసును ఛేదించడంలో ప్రధాన పాత్ర పోషించిన పట్టణ సీఐ విజయ్‌కుమార్, డీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ శరత్‌కుమార్, పోలీసు సిబ్బంది కరుణాకర్, రఫీ, మహేశ్, రాజును అభినందించారు.



తిరుపతిలో నిర్వహించిన పుట్టినరోజు వేడుకల్లో వైఎస్ జగన్ చిత్రపటాలతో వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు



ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం నియోజకవర్గంలో నల్లమల అభయారణ్యంలోని మారుమూల గిరి జన గూడెం పాలుట్లలో జగన్ జన్మదినం సందర్భంగా ఆనందంతో నృత్యం చేస్తున్న గిరిజన మహిళలు



శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో వసతి గృహ విద్యార్థులకు రగ్గులు పంపిణీ చేస్తున్న నియోజకవర్గ సమన్వయ కర్త పేరాడ తిలక్ తదితరులు

ఊరూవాడా సంబరాలు

ఘనంగా ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పుట్టిన రోజు వేడుకలు

సాక్షి, అమరావతి: అభివృద్ధి, సంక్షేమ సారథి, మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా శనివారం ఏపీ వ్యాప్తంగా ప్రజలు, పార్టీ శ్రేణులు, అభిమానులు సంబరాలు చేసుకొన్నారు. శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు 26 జిల్లాల్లో ఘనంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అన్ని ప్రాంతాల్లో కేక్‌లు కట్ చేశారు. వీధులు, కూడళ్లలో వైఎస్ జగన్ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. యువత ర్యాలీలు చేశారు. పేదలు, అనాథలకు వస్త్ర దానాలు చేశారు. భారీ ఎత్తున అన్నదానం నిర్వహించారు. రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. వికలాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ చేశారు. ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు, ఆహారం పంపిణీ చేశారు. తెలంగాణ, తమిళనాడు తదితర రాష్ట్రాల్లోనూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు, వైఎస్ జగన్ అభిమానులు వేడుకలను ఘనంగా నిర్వహించారు. అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, ఇంగ్లండ్ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సహా 14 దేశాల్లోనూ జగన్ జన్మదిన వేడుకలను అభిమానులు వైభవంగా నిర్వహించారు.

కేటీఆర్ అరెస్ట్‌కు రంగం సిద్ధం

- ఓయూ కృతజ్ఞత సభలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్



అభివాదం చేస్తున్న మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఈ–కార్ రేసు కుంభకుణంలో మాజీ మంత్రి కేటీఆర్ అరెస్ట్‌కు రంగం సిద్ధమైందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల సంపదను దోచుకుందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 56 వేల ఉద్యోగాలను భర్తీ చేసినట్లు చెప్పారు. ఇక నుంచి జాబ్ క్యాలెండర్ ప్రకారం ఏటా ఉద్యోగాల భర్తీ జరుగుతుందన్నారు. శనివారం ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీ ఎదుట కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన కృతజ్ఞత సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి టీపీసీసీ అధికార ప్రతినిధి, పీహెచ్‌డీ విద్యార్థి చనగాని దయాకర్ అధ్యక్షత వహించారు. ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గత పదేళ్లలో బీఆర్‌ఎస్ చేయని అభివృద్ధిని ఏడాదిలోనే కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఓయూకు విచ్చేసి ఇక్కడి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని పరిష్కరించాలని మాజీ ఎంపీ వి.హనుమంతరావు అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ డా.రియాజ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు మెడ శ్రీను పాల్గొన్నారు.

మంత్రులు వేస్ట్.. కాదు కాదు పాలన వేస్ట్

ఆమాత్యుల పనితీరు మీద ఏపీ సీఎం సర్వేలో వెల్లడి



సాక్షి, అమరావతి: ఆరునెలల పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వయంగా చేయించుకున్న సర్వేలోనూ అదే విషయం వెల్లడి కావడం అధికార పార్టీ వర్గాలను తీవ్ర కలవరానికి గురిచేస్తోంది. పాలనను ప్రతిబింబించే మంత్రుల పనితీరు మీద ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల సర్వే చేయించి వారికి ర్యాంకింగ్ ఇచ్చారు. ఇదే విషయాన్ని సీఎం స్వయంగా కేబినెట్ సమావేశంలో మంత్రులకు వెల్లడించారు. తాజాగా.. మంత్రుల పనితీరు మీద ర్యాంకులు ఇచ్చిన నివేదికను ప్రభుత్వ పెద్దలు లీక్ చేశారు. కేవలం ఆరుగురు మంత్రుల పనితీరు మాత్రమే సంతృప్తికంగా ఉందని, మిగతా 18 మంది ర్యాంకులు అధ్వానంగా ఉన్నాయని ఆ నివేదిక పేర్కొంది. సహజంగా.. ప్రభుత్వ పాలన తీరుకు మంత్రివర్గం పనితీరును గీటురాయిగా తీసుకుంటారు. మంత్రివర్గంలో 75 శాతం మంది సభ్యుల తీరు ఏమాత్రం బాగోలేదని, సర్వేలో ర్యాంకులు అధ్వానంగా రావడం మంచి పరిణామం కాదని అధికార పార్టీ వర్గాల్లో ఆందోళన నెలకొంది. ర్యాంకులు మరీ అధ్వానంగా ఉన్న మంత్రుల జాబితాలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, సీఎం కుమారుడు లోకేశ్ కూడా ఉండటం గమనార్హం. ప్రభుత్వానికి అన్నీ తామై వ్యవహరిస్తున్న ఈ ఇద్దరి పనితీరు, ప్రభుత్వ పనితీరును వేరుచేసి చూడలేమని, సీఎం చేయించిన సర్వేలో తేలిన విషయమే ప్రజల్లోనూ స్పష్టంగా కనిపిస్తోందని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఎన్నికల్లో అలవికాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఒక్క హామీని కూడా అమలుచేయకుండా కబుర్లతో కాలక్షేపం చేస్తున్న తీరును ప్రజలు గుర్తించారు. ప్రజాసంక్షేమం దిశగా ప్రభుత్వం ఏమీచేయలేక చేతులెత్తేసిన విధానమే మంత్రుల పనితీరు మీద ప్రతిబింబించిందనే విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తించకుండా, 'అధ్వాన్న పనితీరు' పేరిట తమను నిందించడంలో అర్థంలేదని మంత్రులు తమ సన్నిహితుల దగ్గర వాపోతున్న విషయం అధికార పార్టీ వర్గాలకు తెలుసు. పైపెచ్చు.. లోకేశ్ అన్ని మంత్రిత్వ శాఖల్లో జోక్యం చేసుకుంటే తాము చేయడానికి ఏముంటుందని.. తమ చేతులు కట్టేసి తాము అసమర్థులమని సర్వేల్లో తేల్చి ర్యాంకింగ్ ఇవ్వడం ఏమిటని మంత్రులు ప్రశ్నిస్తున్నారు.

పవన్ పనితీరుపైనా అసంతృప్తి..

డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పనితీరు అంత బాగోలేదని నివేదిక తేల్చడమంటే.. అన్ని శాఖల కంటే అత్యధిక బడ్జెట్ ఉన్న పంచాయతీరాజ్ శాఖను ఇచ్చినా ఆయన అందుకు తగ్గ రీతిలో పనిచేయడంలేదని, అంటే ప్రభుత్వ పనితీరు అధ్వానంగా ఉందనే అర్థమని పరిశీలకులు చెబుతున్నారు. హామీలు నెరవేర్చే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడమే మంత్రుల ర్యాంకింగ్ అడ్డంపడుతోందని, అది కేవలం పవన్‌కళ్యాణ్ ఒక్కడి వ్యక్తిగత సామర్థ్యం తక్కువనే భావన కాదని జనసేన వర్గాలు చెబుతున్నాయి. చంద్రబాబు తనయుడు లోకేశ్ నిర్వహిస్తున్న కీలకమైన మానవవనరుల (విద్యా శాఖలు) శాఖలో అన్నీ సమస్యలే ఉండడంతో ఆయన పనితీరుపైనా పెదవి విరుస్తున్నారు.

పెత్తనం లోకేశ్‌ది.. తిట్లు మాకా!?

ఈ ర్యాంకింగ్‌లపై మంత్రులు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. చంద్రబాబు ఏ ప్రాతిపదికన తమ పనితీరు అంచనా వేశారో తెలీడంలేదని సీనియర్ మంత్రులు అచ్చెన్నాయుడు, ఆనం రాం నారాయణరెడ్డి, పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు వంటి నేతలు ఆగ్రహంతో రగిలిపోతున్నట్లు సమాచారం. ప్రభుత్వంలోని అన్ని వ్యవహారాల్లో లోకేశ్ తలదూరుస్తూ నిర్ణయాలు తీసుకుంటున్నారని, ఇక తమకు పనిచేయడానికి అవకాశమెక్కడ ఉందని వారు ప్రశ్నిస్తున్నారు.

పనిచేసేది ఈ ఆరుగురే..

ఇక రాష్ట్ర కేబినెట్‌లో ఆరుగురు మంత్రులు మాత్రమే బాగా పనిచేస్తున్నట్లు నివేదిక తేల్చింది. అందులో మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణ ముందున్నారు. అలాగే..

- విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవి కుమార్, ఎంఎస్‌ఎంఈ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ కూడా బాగా పని చేస్తున్నారని మంచి ర్యాంకింగ్ దక్కింది.
- కూటమిలో జనసేన పార్టీ తరఫున మంత్రిగా ఉన్న నాదెండ్ల మనోహర్, బీజేపీ తరఫున మంత్రిగా ఉన్న సత్యకుమార్ పనితీరు కూడా బాగుందని నివేదిక పేర్కొంది.

రేపు కేటీఆర్‌కు ఈడీ నోటీసులు?

- అర్వింద్‌కుమార్, బీఎల్ఎన్‌రెడ్డిలకు కూడా ఇచ్చే అవకాశం
- ఫార్ములా–ఈ కార్ల రేసు కేసులో చర్యలకు సిద్ధం
- బ్యాంకు అధికారుల నుంచి వివరాలు సేకరించనున్న ఈడీ

సాక్షి, హైదరాబాద్: 'ఫార్ములా–ఈ'కార్ల రేసు వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడు పెంచింది. ఏసీబీ నమోదు చేసిన కేసు ఆధారంగా 'ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసు ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఈసీఐఆర్)'ను నమోదు చేసిన ఈడీ అధికారులు ఈ కేసులో ప్రధాన నిందితులకు సమన్లు ఇచ్చేందుకు సిద్ధం అవుతున్నారు. ఈ కేసులో ఏ–1గా ఉన్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు ఏ–2గా ఉన్న పురపాలకశాఖ మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, ఏ–3గా ఉన్న హెచ్‌ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డికి ఈడీ సోమవారం సమన్లు జారీ చేయనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇప్పటికే ఏసీబీ నుంచి ఫార్ములా–ఈ కారు రేసు ఒప్పందాలకు సంబంధించి సేకరించిన పత్రాలు, ఎఫ్ఐఆర్‌తోపాటు బ్యాంకు లావాదేవీలను ఈడీ అధికారులు పరిశీలించారు. హెచ్ఎండీఏ సాధారణ నిధుల నుంచి యూకేకు చెందిన 'ఫార్ములా–ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈఓ)'కు రూ.45,71,60,625 సొమ్మును విదేశీ కరెన్సీలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ ద్వారా బదిలీ చేశారు. దీంతో సదరు బ్యాంకు అధికారుల వాంగ్మూలాలను ఈడీ అధికారులు నమోదు చేయనున్నారు. ఇందుకు సంబంధించి బ్యాంకు అధికారులను సైతం ప్రశ్నించనున్నారు. ఓవైపు ఈ కేసులో ఈడీ అధికారులు వేగం పెంచగా మరోవైపు తెలంగాణ ఏసీబీ సైతం కీలకాంశాలపై దర్యాప్తు ముమ్మరం చేసింది. కేటీఆర్‌ను ఈ నెల 30 వరకు అరెస్టు చేయొద్దని.. కానీ దర్యాప్తు కొనసాగించుకోవచ్చని హైకోర్టు ఆదేశించడంతో ఆధారాల సేకరణపై ఏసీబీ దృష్టి పెట్టింది. తొలుత హెచ్ఎండీఏ పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి ఎం. దానకిశోర్ వాంగ్మూలం నమోదుతో దర్యాప్తు ప్రక్రియ ప్రారంభించనుంది. ఈడీ, ఏసీబీ దర్యాప్తులో ఏ విషయాలు వెలుగులోకి వస్తాయనేది ఆసక్తికరంగా మారింది. ఏసీబీ సేకరించే పత్రాలు ఈడీకి ఉపయోగపడినట్లే ఈడీ దర్యాప్తులో మనీలాండరింగ్ కోణంలో ఏవైనా ఆధారాలు లభిస్తే ఈ కేసు మరో మలుపు తిరుగుతుందన్న చర్చ నడుస్తోంది.

అభినందన 'పత్రం'

రావి ఆకుపై మాజీ సీఎం జగన్‌కు జన్మదిన శుభాకాంక్షలు



నారాయణఖేడ్: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ఖేడ్‌కు చెందిన ప్రముఖ పత్ర చిత్రకారుడు గుండు శివకుమార్ రావి ఆకులపై చిత్రాలు మలిచారు. ప్రముఖుల జన్మదినోత్సవాలు, ఆయా పండుగలు, ప్రాధాన్యాలపై లీవ్ ఆర్టిస్ట్ గుండు శివకుమార్ చిత్రాలు వేస్తూ విశిష్టతను తెలియపరుస్తుంటారు. ఏపీ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రాలను కూడా రావి ఆకులపై మలచి వినూత్నంగా శుభాకాంక్షలు తెలిపారు.

జూరాలకు స్వల్పంగా పెరిగిన ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి స్వల్పంగా ఇన్‌ఫ్లో పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శనివారం సాయంత్రం వరకు ప్రాజెక్టుకు 2,593 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు తెలిపారు. ఆవిరి రూపంలో 67 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–1కు 650 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 200 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 333 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 747క్యూసెక్కులు, ప్రాజెక్టు నుంచి మొత్తం 1,250 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 8.280 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

పంప్‌మోడ్ పద్ధతిలో 7,602 క్యూసెక్కులు తరలింపు

దోమలపెంట: భూగర్భ కేంద్రంలో పంప్‌మోడ్ పద్ధతిలో 24గంటల వ్యవధిలో శ్రీశైలం ఆనకట్ట దిగువన సాగర్ జలాశయం నుంచి ఆనకట్ట ఎగువన శ్రీశైలం జలాశయంలోకి 7,602 క్యూసెక్కుల నీటిని (ఎత్తిపోతల) తరలించారు. పోతిరెడ్డిపాడు ద్వారా 1,500 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,695, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 2,333 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 3.652 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు. శనివారం శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 862.9 అడుగుల వద్ద 114.9952 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

రామన్‌పాదులో 1,020 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాదు జలాశయంలో శనివారం పూర్తిస్థాయి నీటి మట్టం 1,020 అడుగులు ఉన్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు. జూరాల ఎడమ కాల్వ నుంచి 200, సమాంతర కాల్వ నుంచి 333 క్యూసెక్కుల నీరు జలాశయానికి చేరుతుండగా.. ఎ న్టీఆర్ కాల్వకు 211 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వలకు 95 క్యూసెక్కులు, వివిధ ఎత్తిపోతల పథకాలకు 747 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కులు వినియోగిస్తున్నామని వివరించారు.

కందులు క్వింటాల్ రూ.7,419

దేవరకద్ర: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం జరిగిన టెండర్లలో కందులు క్వింటాల్‌కు గరిష్టంగా రూ.7,419, కనిష్టంగా రూ.7,049 ధరలు నమోదయ్యాయి. అలాగే ఆర్ఎన్ఆర్ ధాన్యం క్వింటాల్ గరిష్టంగా రూ.2,639, కనిష్టంగా రూ.2,609 చొప్పున పలికాయి.

విద్యార్థి ప్రాణం తీసిన కరెంటు



హరీశ్ (ఫైల్)



కుమారుడి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి

- ప్రైవేటు స్కూల్ హాస్టల్ నుంచి బహిర్భూమికి వెళ్లగా విద్యుదాఘాతం
- ఆందోళనకు దిగిన విద్యార్థి, ప్రజా సంఘాలు

వనపర్తి రూరల్: ప్రైవేటు స్కూల్ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్న ఓ విద్యార్థి ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. ఈ ఘటన వనపర్తి మండలం పెద్దగూడెం శివారులో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. చిన్నంబావి మండలం పెద్దమారూరుకు చెందిన శిరీష – భాస్కర్‌రావుల పెద్దకుమారుడు హరీశ్ (15) 9వ తరగతి, చిన్నకుమారుడు గౌతమ్ 8వ తరగతి పెద్దగూడెం శివారులోని రేడియంట్ స్కూల్‌లో చదువుకుంటున్నారు. వారిద్దరు అక్కడే పాఠశాల హాస్టల్‌లో ఉంటున్నారు. శనివారం తెల్లవారుజామున హరీశ్ తన స్నేహితులతో కలిసి బహిర్భూమి కోసం పక్కనే వ్యవసాయ పొలంలోకి వెళ్లారు. అయితే వ్యవసాయ పొలంలో వేరుశనగ పంటకు రక్షణగా ఏర్పాటుచేసిన విద్యుత్ కంచెను గమనించకుండా విద్యార్థి హరీష్ తగలడంతో షాక్‌కు గురయ్యాడు. విషయం తెలుసుకున్న పాఠశాల యాజమాన్యం అక్కడికి చేరుకొని విద్యార్థిని జిల్లా ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుమారుడి మరణవార్తను తెలుసుకున్న తల్లిదండ్రులు ఆస్పత్రికి చేరుకొని కన్నీరు మున్నీరుగా విలపించారు. పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యంతోనే విద్యార్థి మృతిచెందాడని ఆరోపిస్తూ విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు పాఠశాల వద్దనున్న వనపర్తి – పెబ్బేరు ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవడంతో పాటు పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘటనా స్థలానికి డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, సీఐ కృష్ణయ్యలు చేరుకొని వారికి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. ఈ ఘటనపై భూమి యజమాని, పాఠశాల యజమానిపై బాలుడి తల్లి ఫిర్యాదు చేశారని ఎస్ఐ చెప్పారు.



పాఠశాల వద్ద రోడ్డుపై ధర్నా చేస్తున్న సంఘాల నాయకులు

చారిత్రక నిలువురాళ్ల సందర్శన



నిలువురాళ్లను పరిశీలిస్తున్న శిక్షణ కలెక్టర్ గరిమనరుల్లా

కృష్ణా: ముడుమాల్ గ్రామ శివారులో గల చారిత్రక ప్రాంతమైన నిలువురాళ్లను శనివారం జిల్లా శిక్షణ కలెక్టర్ గరిమనరుల్లా, సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ పుల్లారావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆ ప్రాంతంలోని నిలువురాళ్లను, వాటి ప్రాముఖ్యతను ప్రొఫెసర్ పుల్లారావు ద్వారా తెలుసుకున్నారు. ఆదిమానవులు ఏర్పాటు చేసిన నక్షత్ర మండలితో పాటు రుతువులు తెలుసుకునేందుకు అప్పట్లో వారు ఏర్పాటు చేసుకున్నట్లు చెప్పారు. ఈ ప్రాంతాన్ని కాపాడుకునేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ దయాకర్‌రెడ్డి తదితరులున్నారు.

సంగమేశ్వర శిఖరానికి పూజలు

కొల్లాపూర్: సప్తనదీ సంగమ ప్రాంతంలో కొలువైన సంగమేశ్వర ఆలయ శిఖరానికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కృష్ణానదిలో మునిగి ఉన్న ఈ ఆలయం ప్రధాన గోపురంతో పాటు సుబ్రహ్మణ్యస్వామి, నరసింహ్మస్వామి, మృత్యుంజయస్వామి, వజ్రలింగేశ్వరస్వామి, సత్యనారాయణ, సూర్యనారాయణ, గాయత్రీదేవి ఆలయాల గోపురాలు కొద్దిమేర తేలాయి. ప్రధాన ఆలయ శిఖరం వద్ద అర్చకుడు రఘురామశర్మ దేవతా చిత్రపటాలను ఏర్పాటుచేసి పూజలు చేశారు. సంగమేశ్వర ఆలయ శిఖర దర్శనానికి మరబోట్లలో భక్తులను తీసుకువచ్చే వారు గోపురాలకు దూరంగా బోట్లు తిప్పాలని అర్చకులు సూచించారు.



వైభవంగా పడమటి అంజన్న ఉత్సవాలు





ప్రత్యేక అలంకరణలో పడమటి ఆంజనేయస్వామి.. స్వామివారి దర్శనానికి బారులుదీరిన భక్తులు

మక్తల్: పట్టణంలో పడమటి ఆంజనేయస్వామి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కొందరు ఆలయ ప్రాంగణంలోనే స్వామి వారికి నైవేద్యం తయారుచేసి సమర్పించారు. మరికొందరు తలనీలాలు సమర్పించడంతో పాటు పొర్లుదండాలతో మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులతో రాంలీలా మైదానం కిక్కిరిసిపోయింది.



స్వామివారికి నైవేద్యం తయారు చేస్తూ..

ఆదిశిలాక్షేత్రానికి పోటెత్తిన భక్తులు



స్వామివారిని దర్శించుకునేందుకు బారులుదీరిన భక్తులు

మల్దకల్: ఆదిశిలాక్షేత్రం స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసిపోయింది. బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారిని దర్శించుకోలేని భక్తులు, నెలపూజ వరకు స్వామి వారికి దాసంగాలను పెట్టి మొక్కలను చెల్లించుకోవడం ఆనవాయితీ. తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక నుంచి భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకోవడానికి తరలిరావడంతో ఆలయ పరిసరాలన్నీ జనాలతో కిక్కిరిసిపోయాయి.బారీకేడ్లతో భక్తుల క్యూలైన్లకు పోటెత్తారు. అలాగే స్వామివారిని దర్శించుకునేందుకు జెడ్పీ సీఈఓ కాంతమ్మ, ఇంటెలిజెన్సీ అడిషనల్ ఎస్పీతోపాటు వివిధ శాఖల అధికారులు వేర్వేరుగా ప్రత్యేక పూజలు నిర్వహించగా.. అంతకు ముందు ఆలయ అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. పూ జల అనంతరం శేషవస్త్రాలతో సత్కరించి.. మె మోంటోలు అందజేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. క్యూలైన్ల వద్ద పోలీసులు, ఎస్‌వీఎస్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు తమ సేవలను అందించారు. ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్య చంద్రారెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న జెడ్పీ సీఈఓ కాంతమ్మ



దాసంగాలు పెట్టి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు